# పంజాబ్, హర్యానాలలో ధాన్యం సేకరణలో ప్రభుత్వ, కార్పొరేట్ దళారీ-శక్తుల కుమ్మక్కు

**పంజాబ్,** హర్యానాలలో ఈసారి రైతులు ధాన్యాన్ని మార్కెట్‌కి తీసుకువస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం 10 రోజుల పాటు కొనుగోళ్లు వాయిదా వేస్తున్నట్లుప్రకటించింది. అక్టోబర్ 1 వ తేదీనాటికి పంజాబ్ మార్కెట్లలో దాదాపు 1 లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చి చేరింది. వాతావరణంలో మార్పు వల్ల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వారు 10 రోజులు వేచి ఉండటం అసాధ్యం.

ఈప్రాంతంలో భారీ వర్షాల కారణంగా ఈ సమయంలో తేమ శాతం 17% కంటే ఎక్కువగా ఉండడం వల్ల వెంటనే కొనుగోలు ప్రారంభించకుండా వాయిదా వేశామని ప్రభుత్వాలు కారణం చెప్పినప్పటికీ ఇది ప్రధాన అడ్డంకి కాదు. వాస్తవకారణాలు చాలా భిన్నంగా ఉన్నాయి. మొదటి కారణం ప్రభుత్వం రైతాంగ ఉద్యమానికి వెన్నెముకగా భావించే పంజాబ్, హర్యానా రైతాంగాన్ని వేధించాలనుకుంది. రెండవది – కొనుగోలు 10 రోజులు ఆలస్యం అయితే రైతులు కనీస మద్దతు ధరకంటే తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారస్తులకు, కార్పొరేట్లకు విక్రయించవలసి వస్తుంది. ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలలో ప్రధాన ఎజెండా అయిన కార్పొరేట్ సంస్థలను వరి కొనుగోలులోకి తీసుకురావడానికి ఇది దొడ్డిదారిగా ఉపయోగపడుతుంది. మూడవది ఈ సంవత్సరం పంజాబ్‌లో ధాన్యం ఉత్పత్తి దాదాపు 191 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా ఉండగా ఎఫ్‌సిఐ మాత్రం కేవలం 171 లక్షల మెట్రిక్ టన్నుల వరిని మాత్రమే కొనుగోలు చేస్తానని ప్రకటించింది. మిగిలిన 20 లక్షల టన్నులు ఎవరు కొనుగోలుచేస్తారు? కార్పొరేట్‌ల వ్యాపారం కోసం రంగం సిద్ధం చేస్తున్నారని సులభంగానే అర్థంచేసుకోవచ్చు. యుపి, బీహార్ రాష్ట్రాలలో ప్రభుత్వ మార్కెట్ యార్డుల వ్యవస్థ నిర్వీర్యమవ్వడం వల్ల పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో లభించే కనీస మద్దతుధరలో దాదాపు సగం ఉన్నందున ఈ రాష్ట్రాల నుంచి తమ సొంత డీలర్ల ద్వారా ధాన్యాన్ని సేకరించడానికి బిజెపి ప్రణాళిక సిద్ధం చేసుకొంది. ఈ అక్రమ రవాణాతో ఎఫ్‌సిఐ కోటా ముందుగానే పూర్తయి, పెద్ద సంఖ్యలో పంజాబ్, హర్యానా రైతులు అమ్ముకోలేక మిగిలిపోతారు. ఎమ్ఎస్‌పి కంటే చాలా తక్కువ ధరకు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులకు అప్పగించడం తప్పవారికి వేరే మార్గంలేదు. ప్రభుత్వం తను అమలు చేయాలను కుంటున్న దేశవ్యతిరేక, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఈ విధంగా దొడ్డిదారిన అమలు చేయాలనుకుంటోంది.

ప్రభుత్వాల ఈ తరహా కుట్రలను పసిగట్టిన సంయుక్త కిసాన్ మోర్చా దీనినిగట్టిగా ఎదుర్కోవడానికి నిర్ణయించుకుంది. హర్యానాలో బీజేపీ ఎమ్మెల్యేల, ఎంపీల నివాసాలను, పంజాబ్‌లో అధికారపార్టీ ఆయన కాంగ్రెస్, బీజేపీ ఎంఎల్ఏల, ఎంపిల నివాసాల ముందు కూడా నిరవధిక ధర్నాలు ప్రకటించింది. భారీగా పోలీసులను మోహరించినప్పటికీ అక్టోబర్ 2న, రైతులు రెండు రాష్ట్రాల్లో ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి నిరవధిక ఘెరావ్‌లు ప్రారంభించారు. కర్నాల్‌లోని హర్యానా సిఎం నివాసం ముందు పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. రైతాంగంలో వచ్చిన ఈ కదలిక, ఆవేశాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు అంగీకరించవలసి వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో అక్టోబర్ 3 నుండి కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించింది. రైతాంగ సమైక్య పోరాటానికి లభించిన గొప్ప విజయమిది.

తేమ శాతం 17% దాటితే ధాన్యం ధర తగ్గిస్తామని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. తేమ శాతం పెరిగేకొద్దీ ధాన్యం ధరలు ఇంకా తగ్గుతాయని తెలిపింది. అంటే ఏదోఒక విధంగా రైతులు పండించిన పంటలకు ప్రకటించిన ఎంఎస్‌పి కంటే చాలా తక్కువకు కొనుగోలు చేయాలి అనేదే ఉద్దేశ్యం. పంజాబ్, హర్యానాలలోని సంయుక్త కిసాన్ మోర్చా ప్రభుత్వ–కార్పొరేట్ శక్తుల ఈ దుర్మార్గపు ఎత్తుగడలను బహిర్గతం చేయడానికి, పోరాడటానికి రైతాంగాన్ని సమాయత్తపరుస్తున్నారు.

*****